సాక్షి
అనంతపురం

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



'వందే భారత్' రాకకు ఏర్పాట్లు

భాగ్యనగరి నుంచి అనంతపురం మీదుగా ఉద్యాననగరి వెళ్లే 'వందే భారత్' రైలు ఆదివారం మెరుపు వేగంతో దూసుకెళ్లనుంది. ఇందు కోసం ఏర్పాట్లు చేశారు.

8లో

గరిష్టం/కనిష్టం
37.6°/22.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

15 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: అల్పపీడన ద్రోణి, నైరుతి రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. శుక్రవారం రాత్రి నుంచి 15 మండలాల పరిధిలో 4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. యల్లనూరులో అత్యధికంగా 72.4 మి.మీ నమోదు కాగా.. అనంతపురం, నార్పల, శింగనమల పుట్లూరు, బుక్కరాయసముద్రం, రాప్తాడు, కూడేరు, తాడిపత్రి, గార్లదిన్నె, గుత్తి, బెళుగుప్ప, కణేకల్లు, వజ్రకరూరు తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. కాగా.. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

25 నుంచి బీఈడీ రెగ్యులర్ పరీక్షలు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో రెగ్యులర్ బీఈడీ, బీపీఈడీ రెగ్యులర్ మొదటి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 25 నుంచి నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కళ్యాణదుర్గం, అనంతపురం, హిందూపురం, కదిరి, తాడిపత్రి, గుంతకల్లు, ఎస్కేయూ బీఈడీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, నాలుగో సెమిస్టర్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

హౌసింగ్ అధికారులపై విచారణకు ఆదేశం



అనంతపురం టౌన్: ఉచిత ఇసుక కూపన్లను ఇతరులకు అమ్ముకున్నట్లు ఇద్దరు హౌసింగ్ అధికారులపై ఫిర్యాదులు రావడంతో విచారణకు ఆదేశించినట్లు హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెళుగుప్ప మండలానికి సంబంధించి హోలోగ్రామ్‌తో కూడిన ఇసుక కూపన్లను గుండ్లపల్లి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోవర్ధన్‌తోపాటు శశికాంత్ అనే వర్క్ ఇన్‌స్పెక్టర్ కలిసి శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో అమ్ముకున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాల కోసం కేటాయించిన ఉచిత ఇసుక కూపన్లను పక్కదారి పట్టిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ హెచ్చరించారు.

5న పాడి రైతులు, కాపర్లకు అవగాహన

అనంతపురం అగ్రికల్చర్: జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ పథకం గురించి పాడి రైతులు, జీవాల కాపర్లకు అక్టోబర్ 5న నగరంలోని చెరువుకట్ట సమీపంలోని షిరిడీసాయి కల్యాణమంటపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం కింద ఆసక్తి, అర్హత కలిగిన వారు రాయితీతో గొర్రెలు, మేకలు, కోళ్ల, పశుగ్రాస ఉత్పత్తులు చేసే యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. దీనికి సంబంధించి అవగాహన కల్పించి ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

పొసగని పొత్తు!



- టీడీపీ, జనసేన నాయకుల మధ్య తీవ్ర విభేదాలు
- సినీనటుల అభిమాన సంఘాలు సయోధ్యకు ససేమిరా
- నాయకులు నిర్ణయాలు తీసుకున్నా కలిసి పనిచేయలేమని స్పష్టీకరణ
- తాజాగా కొన్ని సామాజిక వర్గాల ప్రత్యేక సమావేశాలు
- తాము లేకపోతే జనసేనకు సీట్లు.. ఓట్లు లేవంటున్న టీడీపీ నాయకులు

అధినేతల 'పొత్తు' నిర్ణయాన్ని ఇరు పార్టీల కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. టీడీపీలో బాలయ్య అభిమానులు.. జనసేనలో పవన్ కళ్యాణ్ అభిమానులు కలిసి నడిచేందుకు సుముఖంగా లేరు. ప్రతిపక్ష హోదా ఉన్న తెలుగుదేశం.. రాజకీయాల్లో ఏమాత్రమూ ప్రభావం చూపని జనసేన పార్టీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని సీనియర్లు అంటున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర పవన్‌కళ్యాణ్ టీడీపీ – జనసేన పొత్తు ఉంటుందని ప్రకటన చేసి వారం కాకముందే ఇరు పార్టీల నాయకుల మధ్య పొత్తు పొసగడం లేదు. అప్పుడే క్షేత్రస్థాయిలో తీవ్ర విభేదాలు పొడచూపుతున్నాయి. స్కిల్ స్కాంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపట్టిన రిలేదీక్షలు, ర్యాలీలకు తెలుగుదేశం పార్టీ నుంచే స్పందన కరువైంది. ఒకటీ రెండు చోట్ల జనసేన కార్యకర్తలు నిరసనకు వచ్చినా తెలుగుదేశం కార్యకర్తలతో ఇమడలేకపోతున్నారు. నాయకులు ములాఖత్‌లూ.. మిలాఖత్‌లూ అయితే మాత్రం తాము వారికి ఓటేయాలా.. అంటూ బాహాటంగానే విమర్శిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అంటేనే అవకాశవాద రాజకీయాలకు పెట్టింది పేరని జనసేన కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

ఆయన పల్లకీకి బోయీలు కాలేం

తెలుగుదేశం పార్టీ వేసే మెతుకుల కోసం తాము రావాలా.. వాళ్లు చెప్పినట్టు నడుచుకోవాలా.. ఆయన సీఎం కావడానికి పల్లకీ మోయడానికి మేము బోయీలుగా ఉండాలా? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలే తెలుగుదేశం పార్టీ అంతిమ దశలో ఉందని, దీనికి తాము ఇప్పుడు ఊపిరి పోయాలా అంటూ కిందిస్థాయి కార్యకర్తలు మాట్లాడుతున్నారు. పైగా చంద్రబాబు వివిధ స్కాముల్లో ఇరుక్కున్నాక టీడీపీ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయి ఉందని, ఈ సమయంలో ఆ పార్టీతో నడవాలని చెప్పడం సరి కాదని పవన్ కళ్యాణ్‌పైనే కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు.

అభిమాన సంఘాలుగా కలిసేదే లేదు

అనంతపురం జిల్లాలో సినిమా నటులకు ఎప్పటి నుంచో అభిమాన సంఘాలున్నాయి. ఇందులో ప్రధానంగా చిరంజీవి, పవన్‌కళ్యాణ్ అభిమాన సంఘాలతో పాటు మహేష్‌బాబు, బాలకృష్ణ అభిమాన సంఘాలు ఉన్నాయి. చిరంజీవి, పవన్ కళ్యాణ్ అభిమాన సంఘాల్లోని యువకులు పలువురు తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వలేమని, అవసరమైతే ఎన్నికలకు దూరంగా ఉంటాం గానీ, టీడీపీకి ఓటు వేయలేమని తెగేసి చెబుతున్నారు. 'పైస్థాయిలో నాయకులు సవాలక్ష మాట్లాడుకుంటారు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు వాళ్లకేం తెలుసు? జెండాలు మోసే మాకే తెలుస్తుంది' అంటూ పేర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా బాలకృష్ణ అభిమాన సంఘం అంటే వీళ్లకు అస్సలు పడదు.

పొత్తును జీర్ణించుకోని సామాజికవర్గాలు..

జిల్లాస్థాయిలో నాయకులను సంప్రదించకుండా, పార్టీలో ఎవరితోనూ చర్చించకుండా జైల్లో ములాఖత్‌కు వెళ్లి బయటికొచ్చి టీడీపీ-జనసేన పొత్తు ప్రకటించడాన్ని పవన్‌కళ్యాణ్‌కు మద్దతుగా ఉండే కొన్ని సామాజిక వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. నాలుగు రోజులుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఆయా సామాజిక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహించుకుని తెలుగుదేశం పార్టీతో కలిసేది లేదని నిర్ణయించినట్టు తెలిసింది. అనంతపురం, కళ్యాణదుర్గం, ధర్మవరం, రాప్తాడు, గుంతకల్లు లాంటి కొన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీతో పొత్తుపై తీవ్రంగా మండిపడుతున్నారు. తెలుగుదేశం, జనసేన ద్వితీయ శ్రేణి నాయకుల్లో అయితే పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. అవసరానికి వాడుకుని వదిలేసే రకం మీరు అని జనసేన నాయకులు అంటుండగా... మేము లేకపోతే మీకు ఓట్లు, సీట్లు ఎక్కడున్నాయి అంటూ తెలుగుదేశం నాయకులు వెటకారంగా మాట్లాడుతున్నారు. దీంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో జనసేన-తెలుగుదేశం పార్టీల మధ్య పొత్తు ఏ మాత్రమూ పొసగదు అని అంటున్నారు. ఇదిలా ఉండగా హైకోర్టులో శుక్రవారం చంద్రబాబు తరఫున వేసిన క్వాష్ పిటీషన్ కొట్టేయడంతో తెలుగుదేశం పార్టీలో మరింత నైరాశ్యం ఏర్పడింది.

న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోండి



సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్

అనంతపురం: న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సూచించారు. న్యాయ సేవాధికార చట్టం కింద ప్రజా ప్రయోజన సేవల్లో శాశ్వత లోక్ అదాలత్ తప్పనిసరిగా పరిష్కారం అందిస్తుందన్నారు. న్యాయ సేవా సదన్‌లో శనివారం ప్రజా ప్రయోజన సేవ శాఖల ప్రభుత్వ అధికారులకు శాశ్వత లోక్ అదాలత్‌లో ప్రజా ప్రయోజన కేసుల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం చైర్మన్ జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ అటు రాజీమార్గంలో పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. రాజీ కాని పక్షంలో తీర్పు వెలువరించగల అధికారమూ కలిగి ఉంటుందన్నారు. శాశ్వత లోక్ అదాలత్ గురించి చైర్మన్ జి.శ్రీనివాసరావు వివరించారు. రాజీ కుదరని పక్షంలో ధర్మాసనం తీర్పు వెలువరిస్తుందని, ఇది అప్పీలు లేని శాశ్వత లోక్ అదాలత్ తీర్పు అవుతుందని స్పష్టం చేశారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, ప్రసంగించారు.

బాబు శాశ్వతంగా జైల్లోనే

- ప్రజాధనం లూటీ చేసినందుకే కటకటాలపాలు
- స్కిల్‌స్కాంలో సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే
- ఫైబర్ నెట్, రింగ్‌రోడ్డు కుంభకోణాల్లోనూ ప్రమేయం
- అవినీతి తిమింగలం మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు
- విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేసిన పాపాలు, మోసాలు, అవినీతి అక్రమాలు ఇన్నాళ్లకు బయటపడ్డాయని, ఆయనపై నమోదైన కేసులన్నింటినీ విచారణ చేస్తే శాశ్వతంగా జైలులో శిక్ష అనుభవించాల్సిందేనని, బెయిల్ అన్న మాటే ఉండదని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. శనివారం రాయదుర్గంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో విప్ విలేకరులతో మాట్లాడారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సూత్రధారి, పాత్రధారి చంద్రబాబేనని విమర్శించారు. రూ.371 కోట్ల ప్రజాధనాన్ని అడ్డంగా లూటీ చేసి దొరికాడు కాబట్టే జైలుపాలయ్యారన్నారు. అయినా చంద్రబాబు అరెస్టు అక్రమమంటూ టీడీపీ నాయకులు గగ్గోలు పెట్టడం దారుణమన్నారు. ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ప్రమేయం కూడా ఉందన్నారు. ఇప్పటికే ఈడీ కూడా కొందరిని విచారణ చేసి జైలుకు పంపిందన్నారు. ఇవన్నీ తెలిసినా కక్ష సాధింపు అంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదిస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. ఇన్నాళ్లూ ఏ కేసులనూ విచారణ చేయకుండా వ్యవస్థలను మేనేజ్ చేసిన చంద్రబాబుకు.. స్కిల్ స్కాంలో ఖరీదైన లాయర్లను రంగంలోకి దింపినా రిమాండ్‌ను ఆపలేకపోయారన్నారు.

ధైర్యముంటే సీబీఐ విచారణ కోరండి

చంద్రబాబు అవినీతికి పాల్పడలేదంటూ ఆయన సత్యహరిశ్చంద్రుడని భావించే టీడీపీ నాయకులు వెంటనే సీబీఐ విచారణ కోరాలని విప్ సవాల్ చేశారు. టీడీపీ హయాంలోనే ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ టేకప్ చేసిందనే విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబుకు నోటీసులు ఇవ్వగానే వ్యక్తిగత సహాయకుడు, మరో వ్యక్తి దేశం విడిచి పారిపోయారన్నారు. ఇన్నాళ్లు బీరాలు పలికిన నారా లోకేశ్‌కు 'అరెస్టు' భయం పట్టుకుని, ఢిల్లీలో తలదాచుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఫైబర్‌నెట్, రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్, అసైన్డ్ ల్యాండ్ పూలింగ్‌లోనూ కుంభకోణాలు జరిగాయని, వీటిపై కూలంకుశంగా చర్చించేందుకు శాసనసభలో సమయం కేటాయించినా టీడీపీ ఎమ్మెల్యేలు తప్పించుకుని వెళ్లిపోయారని విమర్శించారు. వారి ప్రవర్తన తీరు రౌడీలు, గూండాలను తలపించిందన్నారు. బాలకృష్ణ అయితే దిగజారి ప్రవర్తించారని దుయ్యబట్టారు. ఇలాంటి వాళ్లను ఎమ్మెల్యేలుగా పంపినందుకు ప్రజలు సిగ్గుతో తలదించుకోవాల్సి వచ్చిందన్నారు.

అవినీతి తిమింగలం కాలవ

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అవినీతి తిమింగలమని ప్రభుత్వ విప్ కాపు ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ.వందల కోట్లు దోపిడీ చేసి అడ్డంగా బుక్కయ్యారన్నారు. ఈ అవినీతి బండారాన్ని టీడీపీ మానస పుత్రికగా చెప్పుకొనే 'ఈనాడు'లోనే బయటపెట్టారన్నారు. టీడీపీ హయాంలో ఆర్థికంగా లబ్ధి పొందాడు కాబట్టే చంద్రబాబుకు మద్దతుగా రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు ఆమరణ దీక్ష పేరుతో డ్రామాకు తెరలేపారన్నారు. ఒక దొంగకు మరొక గజదొంగ మద్దతు పలికినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బాబు, రాయదుర్గంలో కాలవ పని అయిపోయిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొని ఉపేంద్రరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ, డీ హీరేహాళ్ మండల కన్వీనర్లు అరవ శివప్ప, ఎం.వన్నూర్‌స్వామి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు సిద్ధం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో డీఆర్‌ఓ, ఆర్డీఓ

- కొత్తగా 15 పోలింగ్ కేంద్రాలు
- 116 చోట్ల పేరు మార్పు.. 83 చోట్ల ప్రదేశం మార్పు
- మార్పులపై రాజకీయ పార్టీలు సూచనలివ్వాలన్న కలెక్టర్

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024లో భాగంగా జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశామని కలెక్టర్ గౌతమి తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశంపై కలెక్టర్ శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 2,198 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. హేతుబద్ధీకరణ తరువాత కొత్తగా 15 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. దీంతో కేంద్రాల సంఖ్య 2,213కు పెరుగుతుందన్నారు. ఇక 83 చోట్ల ప్రదేశం మార్పు కోసం, 116 కేంద్రాలకు ప్రస్తుతం ఉన్న భవనం పేరు మార్పునకు ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పుపై రాజకీయ పార్టీలు తమ సూచనలు తెలపవచ్చన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో కొత్తగా మూడు కేంద్రాలు, తాడిపత్రిలో ఒకటి, శింగనమలలో రెండు, అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 9 కేంద్రాలు మొత్తం 15 కేంద్రాలు పెరగనున్నాయన్నారు.

పోలింగ్ కేంద్రాలు ఇలా...

కొత్తగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలతో కలిపి రాయదుర్గం నియోజకవర్గంలో 296, ఉరవకొండలో 259, గుంతకల్లులో 276, తాడిపత్రిలో 272, శింగనమలలో 293, అనంతపురం అర్బన్‌లో 277, కళ్యాణదుర్గంలో 261, రాప్తాడు నియోజకవర్గంలో 279 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

ప్రదేశం, పేరు మార్పు..

రాయదుర్గం నియోజకవర్గంలో 28 కేంద్రాల ప్రదేశం, 11 చోట్ల పేరు మార్పు, ఉరవకొండలో రెండు కేంద్రాల ప్రదేశం మార్పు, గుంతకల్లులో 7 కేంద్రాల ప్రదేశం, 32 కేంద్రాల పేరు మార్పునకు ప్రతిపాదనలు వచ్చాయి. తాడిపత్రిలో 13 కేంద్రాల ప్రదేశం, 25 చోట్ల పేరు మార్పు, శింగనమలలో 6 కేంద్రాల ప్రదేశం మార్పు, 5 కేంద్రాల పేరు మార్పు, అనంతపురం అర్బన్‌లో 22 కేంద్రాల ప్రదేశం, 13 కేంద్రాల పేరు మార్పు, కళ్యాణదుర్గంలో 13 కేంద్రాల పేరు మార్పు, రాప్తాడు నియోజకవర్గంలో 5 కేంద్రాల ప్రదేశం, 17 కేంద్రాల పేరు మార్పునకు ప్రతిపాదనలు వచ్చాయి.

'దిశ' స్టేషన్‌లో ప్రక్షాళనకు శ్రీకారం

- ఇకపై సఖి సెంటర్‌లోనే కౌన్సెలింగ్
- 'దిశ' సేవలు ఆదర్శంగా ఉండాలి
- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలు



అనంతపురం క్రైం: 'దిశ' పోలీసు స్టేషన్‌లో సిబ్బంది ప్రక్షాళనకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శ్రీకారం చుట్టారు. చిన్నచిన్న సమస్యలు, మనస్పర్థలతో ఎడబాటుకు లోనైన దంపతులను స్నేహపూర్వక వాతావరణంలో కౌన్సెలింగ్ ఇచ్చి కాపురాలు నిలబడేలా చూడాలని సిబ్బందికి సూచించారు. మహిళలకు రక్షణ, సత్వర న్యాయం కల్పించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'దిశ' పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే బాధితులకు సర్దిచెప్పి సంసారం చక్కదిద్దడంలోను, న్యాయం కల్పించే విషయంలోను కొందరు సిబ్బంది అనుసరిస్తున్న తీరు విమర్శలకు తావిచ్చింది. దీన్ని ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. స్టేషన్‌లో ఏమి జరుగుతోంది, సిబ్బంది పని తీరు ఏ విధంగా ఉంది అన్న అంశాలపై ఆరా తీశారు. 'దిశ' స్టేషన్ సేవలు ఆదర్శంగా ఉండాలని సూచించారు. బాధితులు స్టేషన్‌కు వచ్చామన్న భావన కాకుండా కుటుంబ సభ్యులతో కలసి సమస్యలపై చర్చించుకుని పరిష్కరించుకునేందుకు అనువైన వాతావరణం కల్పించాలన్నారు. సమస్యకు పరిష్కారం పొందగలిగేంతవరకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. కుదరని పక్షంలో బాధితుల పక్షాన పోలీసులు నిలవాలన్నారు. అలా కాకుండా పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి పట్ల దురుసుగా వ్యవహరించడం తగదని అన్నారు. ఇకపై కౌన్సెలింగ్‌ను ఐసీడీఎస్ పరిధిలోని సఖి సెంటర్‌లోనే నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు.

ఇద్దరు ఎస్‌ఐలకు స్థానచలనం

జిల్లాలో ఇద్దరు ఎస్‌ఐలకు స్థాన చలనం కల్పిస్తూ ఎస్పీ అన్బురాజన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కళ్యాణదుర్గం పట్టణ ఎస్‌ఐ ఆశాభానును అనంతపురం 'దిశ' స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో కొనసాగిన ఎస్‌ఐ బాలరాజును సీసీఎస్ కోర్టు మానిటరింగ్ సెల్‌కు బదిలీ చేశారు. దిశ స్టేషన్‌లో మరో ఎస్‌ఐ భాస్కర్‌ను ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు చేసినట్లు తెలిసింది.

'స్టాండప్ ఇండియా' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

అనంతపురం టౌన్: 'స్టాండప్ ఇండియా' పథకాన్ని ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 560 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 86 యూనిట్లను లబ్ధిదారులకు మంజూరు చేశామని, మిగిలినవి కూడా త్వరలోనే అందజేస్తామని పేర్కొన్నారు. ఈ పథకంలో రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణాలు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు పరిశ్రమల శాఖ కార్యాలయంలోని హెల్ప్ డెస్కును సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

వందశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యం : డీఈఓ



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ నాగరాజు

రాప్తాడు రూరల్: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఇప్పటి నుంచే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు డీఈఓ నాగరాజు సూచించారు. అనంతపురం రూరల్ మండలం కందుకూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. 'మనబడి నాడు –నేడు' కింద చేపట్టిన పనులు పరిశీలించారు. గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. 7, 10వ తరగతి విద్యార్థుల నోటు బుక్కులు పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన నాణ్యతను, పలు రికార్డులను పరిశీలించారు.

శ్రీవిద్య పాఠశాల సీజ్



పాఠశాలను సీజ్ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: యూకేజీ విద్యార్థి కీర్తన మృతికి కారణమైన శ్రీవిద్య పాఠశాలను సీజ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులతో కలసి శనివారం ఉదయం ఆ పాఠశాలను డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్, ఎంఈఓ మస్తాన్ రాజు తనిఖీ చేశారు. రేకుల షెడ్ల కింద తరగతి గదులను బండలతో ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి స్పష్టం కావడంతో సీజ్ చేస్తున్నట్లు ప్రకటించి, తాళం వేశారు. అలాగే గుంతకల్లులోని పలు పాఠశాలల్లో తరగతి గదులను బండలతో ఏర్పాటు చేశారని, వాటిని కూడా గుర్తించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. అలాంటి పాఠశాలకు త్వరలో నోటీసులు జారీ చేసి వారం రోజులు గడువు ఇస్తామని, ఈ లోపు పక్కా భవనాలు ఏర్పాటు చేసుకోకపోతే వాటిని కూడా సీజ్ చేస్తామని అధికారులు హామీనిచ్చారు.

'వందే భారత్' కోసం 'అనంత' ఏర్పాట్లు



వందేభారత్ రైలు ఇదే



రెండు విభాగాలుగా సీటింగ్ సిస్టం

- భాగ్యనగరి నుంచి ఉద్యాననగరి వరకు నేటి నుంచి వందేభారత్
- కర్నూలు, అనంతపురం, హిందూపురం మీదుగా రాకపోకలు
- ఒకేసారి తొమ్మిది రైళ్లను వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- 'అనంతపురం స్టేషన్‌లో భారీగా స్వాగత ఏర్పాట్లు చేసిన రైల్వే అధికారులు

అనంతపురం సిటీ: ఎన్నో ప్రత్యేకతలు.. మరెన్నో విశిష్టతలు కలిగిన 'వందే భారత్' రైలు ఆదివారం నుంచి పట్టాలపై మెరుపు వేగంతో దూసుకుపోనుంది. పూర్తి దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన వందేభారత్ రైళ్లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక ప్రధాన మార్గాల్లో ప్రవేశపెట్టింది. తాజాగా ఆదివారం ఒక్క రోజే దేశ వ్యాప్తంగా తొమ్మిది మార్గాల్లో వందేభారత్ రైళ్లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో న్యూఢిల్లీ నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందులో భాగ్యనగరి నుంచి ఉద్యాననగరి మధ్య సంచరించే వందేభారత్ కూడా ఉంది. దీంతో ఇన్నాళ్లూ ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న ఈ ప్రాంత ప్రజల కల సాకారం కానుంది.

సాయంత్రం 6.00–6.30 గంటలకు అనంతకు రాక

ఆదివారం ఉదయం 11.30–12.00 గంటల మధ్య ప్రధానమంత్రి మోదీ వర్చువల్ విధానంలో వందే భారత్ రైళ్లను ప్రారంభించిన అనంతరం కాచిగూడ నుంచి బయలుదేరే ఈ రైలు మహబూబ్‌నగర్, కర్నూలు మీదుగా అనంతపురానికి సాయంత్రం 6 నుంచి 6.30 గంటల మధ్య రానుంది. ఇందుకు సంబంధించి స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్, జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్, ఆర్పీఎఫ్ పోలీసులు ఏర్పాట్లు చేశారు. మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీలు రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం సలీం, కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో పాటు బీజేపీ ముఖ్యులను రైల్వే అధికారులు ఆహ్వానించారు. ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో రైళ్లను ప్రారంభించే సన్నివేశాలను వీక్షించేందుకు వీలుగా రైల్వే స్టేషన్‌లో పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేశారు. అనంతపురంలో వందేభారత రైలుకు ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి రెగ్యులర్‌గా రాకపోకలు

వందేభారత్ రైళ్లను ఆదివారం నుంచి ప్రధాని ప్రారంభించినా సోమవారం నుంచి అవి రెగ్యులర్‌గా రాకపోకలు సాగిస్తాయి. కాచిగూడ-యశ్వంతపూర్ మధ్య బుధవారం మినహాయించి మిగిలిన రోజుల్లో ఈ రైలును నడపనున్నారు. కాచిగూడ-యశ్వంత్‌పూర్ మధ్య 610 కిలోమీటర్ల దూరం కాగా 8.30 గంటల్లో గమ్యస్థానం చేరుకుంటుంది. కాచిగూడలో తెల్లవారుజామున 5.30 గంటలకు బయలుదేరి యశ్వంత్‌పూర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది. తిరిగి అక్కడ మధ్యాహ్నం 2.45కు బయలుదేరి కాచిగూడకు రాత్రి 11.10 గంటలకు చేరుకుంటుంది. అనంతపురంలో నిమిషం మాత్రం ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5.40కు వచ్చి 5.41కి బయలుదేరుతుంది.

రెండు రకాలుగా చార్జీలు ఇలా..

వందేభారత్ రైలులో చార్జీలను కామన్ కోచ్, ఎగ్జిక్యూటివ్ కోచ్ అని రెండు రకాలుగా విభజించి వసూలు చేస్తారు. బేసిక్ చార్జ్‌తో పాటు మరో ఐదు రకాల చార్జీలు కలుపుకుని ధర నిర్ణయించారు.

వందేభారత్ రైలులో చార్జీలు ఇలా...

	కామన్ కోచ్ చార్జీ	ఎగ్జిక్యూటివ్ చార్జీ
కాచిగూడ-మహబూబ్ నగర్	రూ.470	రూ.900
కాచిగూడ-కర్నూలు	రూ.795	రూ.1480
కాచిగూడ-అనంతపురం	రూ.1,060	రూ.2,010
కాచిగూడ-ధర్మవరం	రూ.1,105	రూ.2,110
కాచిగూడ-యశ్వంతపూర్	రూ.1,600	రూ.2,915
మహబూబ్‌నగర్-కర్నూలు	రూ.610	రూ.1,110
మహబూబ్‌నగర్-అనంతపురం	రూ.890	రూ.1,670
మహబూబ్‌నగర్-ధర్మవరం	రూ.935	రూ.1,760
మహబూబ్‌నగర్-యశ్వంత్‌పూర్	రూ.1,465	రూ.2,645
కర్నూలు-అనంతపురం	రూ.670	రూ.1,235
కర్నూలు-ధర్మవరం	రూ.725	రూ.1,335
కర్నూలు-యశ్వంత్‌పూర్	రూ.1,230	రూ.2,160
అనంతపురం-ధర్మవరం	రూ.380	రూ.705
అనంతపురం-యశ్వంత్‌పూర్	రూ.840	రూ.1,460
ధర్మవరం-యశ్వంత్‌పూర్	రూ.780	రూ.1,335

లింక్ రోడ్డు పనుల పూర్తికి చర్యలు



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో ఆర్డీఓ మధుసూదన్, అదనపు కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం అర్బన్: నగరంలో అర్బన్ లింక్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ స్పష్టం చేశారు. శనివారం ఆయన కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఆర్డీఓ మధుసూదన్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డితో కలిసి జాతీయ రహదారి 42 అర్బన్ లింక్ రోడ్డుకు సంబంధించి 3జీ విచారణ సమావేశం నిర్వహించారు. అర్బన్ లింక్ రోడ్డుకు సంబంధించి భూ సేకరణపై స్థల, భవన యజమానులకున్న సందేహాలను ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నివృత్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లింక్‌రోడ్డుకు సంబంధించి 3జీ ప్రతిపాదనలు ఫైనలైజ్ అయిన తరువాత అవార్డు దశకు వెళతామన్నారు. నిబంధనల ప్రకారం రాబోయే నెలలో అవార్డు ప్రక్రియ పూర్తి చేసి భూ యజమానుల నుంచి ఖాతా వివరాలు తీసుకుని నష్టపరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, అధికారులు, భవన యజమానులు పాల్గొన్నారు.

'భూ హక్కు'తో సమస్యలకు పరిష్కారం



భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్ (చిత్రంలో) ఆర్డీఓ నిశాంతరెడ్డి

బ్రహ్మసముద్రం: దశాబ్దాలుగా నెలకొన్న భూ వివాదాలకు 'జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష' పథకంతో శాశ్వత పరిష్కారం దక్కిందని మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం ద్వారా రీ సర్వే పూర్తయిన బ్రహ్మసముద్రం మండలం తోటకల్లు లబ్ధిదారులకు శనివారం భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ... గ్రామీణా ప్రాంతాల్లో భూ తగాదాల వల్ల ఎక్కువగా రైతుల మధ్య గొడవలు చోటు చేసుకునేవని గుర్తు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్.. రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేపట్టి కచ్చితమైన కొలతలతో హద్దులు నిర్ణయించి రికార్డులు పక్కాగా రూపొందించి, రైతులకు హక్కు పత్రాలు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, తహసీల్దార్ బాలకిషన్, ఎంపీడీఓ దాసానాయక్, ఆర్‌ఐ నాగిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, ఎంపీపీ చంద్రశేఖరరెడ్డి, వైస్‌ఎంపీపీ వెంకటేష్‌నాయక్, సర్పంచ్‌లు కవితమ్మ, రామ్మోహన్, మంజునాథ, ఆదినారాయణరెడ్డి, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాదరెడ్డి, ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్ ‌డ్డి, రైతు సంఘం అధ్యక్షుడు గోపాలరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

'ఈ క్రాప్' నమోదు పక్కాగా చేపట్టండి



అధికారులకు సూచనలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: ఈ ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల ఈ – క్రాప్ నమోదు పక్కాగా చేపట్టాలని వ్యవసాయాధికారులను ఆ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు.

బీకేఎస్ మండలం ఓబులాపురం గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఏఏ రకాల పంటలు సాగు చేసిందో వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 30వ తేదీ లోపు ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి కావాలన్నారు. సాగు చేసిన పంట వివరాలను మాత్రమే నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీ రవి, మండల వ్యవసాయ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి, రైతులు మహేశంధరెడ్డి, అమర్‌నాథ్, వెంకటరామిరెడ్డి, ఉద్యాన సహాయకుడు నరసింహులు రైతులు పాల్గొన్నారు.

ఆదరణ బాధితులతో కిక్కిరిసిన డీపీఓ



అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్‌ను కలిసేందుకు వచ్చిన బాధితులు

అనంతపురం క్రైం: ఆదరణ చిట్‌ఫండ్స్ బాధితులతో జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణం శనివారం కిటకిటలాడింది. దాదాపు వందకు పైగా బాధితులు ఎస్పీ అన్బురాజన్‌ను కలసి తమకు న్యాయం చేయాలంటూ వినతి పత్రాలు అందజేశారు. ఎస్పీ సూచన మేరకు అనంతపురం టూటౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు మీడియాతో మాట్లాడారు. ఆదరణ చిట్‌ఫండ్స్, సొసైటీ తదితర పేర్లతో వందల కుటుంబాలను నిర్వాహకులు మోసం చేశారని వాపోయారు. కష్టార్జితంతో రూ.వంద కోట్లు కొల్లగొట్టి స్థిరాస్తులు కూడబెట్టుకుని చివరకు బోర్డు తిప్పేసిన మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకుని, తమ డబ్బు ఇప్పించాలని ఎస్పీని కోరినట్లు వివరించారు.

ప్రతి ఫిర్యాదుపై కేసు నమోదు

ఒకేసారి పెద్ద ఎత్తున కరలిసేందుకు వచ్చిన ఆదరణ బాధితుల పట్ల ఎస్పీ అన్బురాజన్ సానుకూలంగా స్పందించారు. బాధితుల ప్రతి ఫిర్యాదునూ స్వీకరించి కేసు నమోదు చేయాలని సీఐ శివరాముడిని ఆదేశించారు. దీంతో టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ముగ్గురు రైటర్లను ఏర్పాటు చేశారు. బాధితులు ఎక్కువ మంది పెద్ద మొత్తంలో చిట్స్, ఎఫ్‌డీలు చేసిన వారు కావడంతో ఎన్ని కోట్ల రూపాయలు మోసపోయారన్నది ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసుల నమోదు అనంతరం ఎస్‌బీ ఖాతాల్లో ఎంత, చిట్స్ రూపంలో ఎంత నగదు అందాల్సి ఉంది, ఫిక్స్‌డ్ డిపాజిట్లు కింద ఎంత ఉంది తేలనుంది.

ఏపీఎల్ మిక్స్‌డ్ జండర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీ ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో తొలిసారిగా శనివారం నుంచి ఏపీఎల్ క్రికెట్ మిక్స్‌డ్ జండర్ టోర్నీ ప్రారంభమైంది. అనంతపురం స్పోర్ట్స్ విలేజ్, గుత్తి, కళ్యాణదుర్గం, ధర్మవరం కేంద్రాల్లో మొత్తం 15 జట్లు పాల్గొన్నాయి. ప్రతి జట్టులోనూ ఐదుగురు అమ్మాయిలు, ఆరుగురు అబ్బాయిలు ఉంటారు. బ్యాటింగ్ భాగస్వామ్యంలో ఓ అమ్మాయి, అబ్బాయి ఉంటారు. అమ్మాయిలు 10 ఓవర్లు, అబ్బాయిలు 10 ఓవర్లు విధిగా బౌలింగ్ చేస్తారు. తొలి రోజు రాప్తాడు, గుత్తి, తాడిపత్రి, నార్పల, గుట్లూరు, ధర్మవరం, కదిరి జట్లు విజయం సాధించాయి.

తల్లీబిడ్డ అదృశ్యం



వర్షిత, రేణుకమ్మ

కణేకల్లు: అంగడికెళ్లి వస్తామంటూ కుమార్తెతో కలసి వెళ్లిన తల్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం 43 ఉడేగోళం గ్రామానికి చెందిన యర్రగుంట ధనుంజయ, రేణుకమ్మ దంపతులు. వీరికి ఆరేళ్ల వయసున్న కుమార్తె వర్షిత ఉంది. ఈ నెల 20న ఇంట్లోకి అవసరమైన సరుకులు కొనుగోలు చేసుకుని వస్తానంటూ కుమార్తెను పిలుచుకుని రేణుకమ్మ కణేకల్లుకు వెళ్లింది. ఆ తర్వాత ఆమె తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో ధనుంజయ ఆరా తీసినా ఫలితం దక్కలేదు. దీంతో శనివారం ఆయన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ నమోదు ఏసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 01870కు సమాచారం అందించాలని కోరారు.

ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

అనంతపురం: పాలిమర్ టెక్నాలజీలో ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ మెషిన్ ఆపరేటర్, అసిస్టెంట్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ మెషిన్ ఆపరేటర్ కోర్సుల్లో విజయవాడ కేంద్రంగా భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ)లోనైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ, జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి సంస్థ సౌజన్యంతో మూడు నుంచి ఆరు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుంది. పదో తరగతి ఉత్తీర్ణత, 18 నుంచి 35 సంవత్సరాల వయసున్న ఓబీసీ, ఎస్సీ, నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూరు, చెన్నై ప్రాంతాల్లోని ప్రముఖ ప్లాస్టిక్ ఉత్పత్తి అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి, ట్రైనింగ్ కిట్, యూనిఫామ్, సేఫ్టీ షూస్ అందజేస్తారు. పూర్తి వివరాలకు 63001 47965 (ఆర్. శ్రీను)లో సంప్రదించవచ్చు.

ఏసీఏ క్రికెట్ టోర్నీకి ముగ్గురి ఎంపిక

అనంతపురం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్వాడ్రాగ్యులర్ సిరీస్‌కు అనంతపురం జిల్లాకు చెందిన ముగ్గురు క్రికెటర్లు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో సోయబ్‌ఖాన్, డీబీ ప్రశాంత్‌కుమార్, వినయ్ కుమార్ ఉన్నారు. ట్రైనర్‌గా బొమ్మన్న వ్యవహరించనున్నారు. ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ విశాఖపట్నం వేదికగా ఈ టోర్నీ జరగనుంది.

అందుబాటులో పప్పుశనగ, పెసర విత్తనాలు

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో పప్పుశెనగ, పెసర విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు ఆ కేంద్రం కో-ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. డబ్ల్యూజీజీ 42 రకం పెసర విత్తనం కిలో రూ.130, ఎన్‌బీసీజీ 452 రకం పప్పుశెనగ విత్తనం కిలో రూ.100కు విక్రయిస్తున్నారు. పూర్తి సమాచారానికి 70135 71755, 90525 57119, 70320 58368లో సంప్రదించవచ్చు.

బైక్ చక్రం, బ్యాటరీ అపహరణ

రాయదుర్గం టౌన్: ద్విచక్రవాహనం ముందు చక్రం, బ్యాటరీ మాత్రమే అపహరించుకెళ్లిన ఘటన రాయదుర్గంలో చోటు చేసుకుంది. రాయదుర్గంలోని దబ్బుడి కాంప్లెక్స్ ప్రాంతంలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు కిరణ్ శుక్రవారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట ఉంచి నిద్రపోయాడు. శనివారం ఉదయం నిద్రలేచి చూసేసరికి బైక్ ముందు చక్రం, బ్యాటరీని దుండగులు అపహరించుకెళ్లారు. రాయదుర్గంలో ఇటీవల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, పోలీసులు ఇప్పటికైనా స్పందించి నిఘా మరింత పెంచాలని ఈ సందర్భంగా పలువురు కోరారు.

కాంట్రాక్టర్ ఆత్మహత్య

అనంతపురం క్రైం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీలో నివాసముంటున్న షేక్ ఖాజా (45)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాంట్రాక్ట్ కింద భవనాలకు పెయింటింగ్ వేసే పనులు చేపడుతుంటాడు. ఈ క్రమంలో అప్పులు చేసి పలు ప్రాంతాల్లో ఒప్పందం చేసుకున్న భవనాలకు పెయింటింగ్ పనులు పూర్తి చేశాడు. అయితే సకాలంలో డబ్బులు చేతికి అందకపోవడంతో అప్పులు తీర్చలేక మదనపడేవాడు. వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు మొదలవడంతో మనస్తాపం చెందిన ఆయన శనివారం ఉదయం తన గదిలోకి వెళ్లి లుంగీతో ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు గుర్తించేలోపు ఆయన మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ ప్రతాపరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

అనంతపురం రూరల్: సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని వసతి గృహాల విద్యార్థులకు తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని వార్డెన్లకు ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు సమకూర్చాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు. హాస్టళ్ల నిర్వహణపై అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సహాయ సంక్షేమ అధికారులు, వార్డెన్లతో శనివారం ఆయన సమీక్షించారు. నూతన మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ట్యూటర్లను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించాలని, సెలవు దినాల్లో పది, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. వార్డెన్లు స్థానికంగా ఉంటూ ఎల్లవేళలా విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘పట్టణ ప్రణాళిక’ పట్టదా?

▸ నగరంలోని సుభాష్‌రోడ్డు ట్రెండ్స్ సమీపంలో నిర్మిస్తున్న జీప్లస్ 4 భవనం ఇది. ప్రస్తుతం ఫీజుల పెండింగ్‌తో నిర్మాణ అనుమతులు షార్ట్‌ఫాల్‌లో ఉంది. కానీ నిర్మాణ పనులు యథేచ్ఛగా సాగుతున్నాయి.



సుభాష్‌రోడ్డులో ట్రెండ్స్ సమీపంలో అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టిన దృశ్యం

- అనుమతి లేకుండానే యథేచ్ఛగా నిర్మాణాలు
- టౌన్ ప్లానింగ్, ఎల్‌టీపీలు కుమ్మక్కు
- ఎల్‌టీపీలపై చర్యలు లేవు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారుల అనధికార అనుమతితో భవన నిర్మాణదారులు బరితెగిస్తున్నారు. నిర్మాణానికి అనుమతి రాకుండానే యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. నగరం నడిబొడ్డునే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా, టౌన్ ప్లానింగ్ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు.

ఎల్‌టీపీలపై చర్యలేవి?

వాస్తవంగా నిర్మాణదారుడు ఎల్‌టీపీ ద్వారా అనుమతులకు దరఖాస్తు చేస్తారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఎప్పటికప్పుడు అనుమతులకు సంబంధించి ఫీజులు, తదితర వాటిని ఎల్‌టీపీకి సమాచారం ఇస్తారు. కానీ అనుమతులరాకనే నిర్మాణాలు చేపట్టడం వెనుక ఎల్‌టీపీల పాత్ర లేకపోలేదని చెప్పాలి. పక్కాగా అనుమతులు వచ్చాకే నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీన్ని కారణాన్ని చూపుతూ ఎల్‌టీపీలను బ్లాక్ లిస్టు జాబితాలో చేర్చొచ్చు. అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణంపై ప్రారంభ దశలోనే కఠిన చర్యలు తీసుకోవచ్చు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు, కొందరు ఎల్‌టీపీలు కుమ్మక్కైనట్లు నగరపాలక సంస్థ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

పర్యవేక్షణ ఏదీ?

నగరపాలక సంస్థకు అత్యధికంగా ఆదాయం వచ్చే వాటిలో టౌన్ ప్లానింగ్ విభాగం ఒకటి. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో నగరపాలక సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. దీంతో పాటు ముఖ్యంగా ఓ ప్రణాళిక లేకుండా నిర్మాణాలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో ఏదైనా అగ్ని ప్రమాదాలు, విపత్తులు సంభవించినప్పుడు భారీగా ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుంది. ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయాల్సి నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే నగరంలో ఇబ్బడిముబ్బడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.



రాంనగర్‌లో అనుమతి లేకుండా సెల్లార్ ఏర్పాటు చేసిన దృశ్యం

▸ ఇక్కడ నిర్మిస్తున్న మరో బహుళ అంతస్తు భవనం రాంనగర్‌లో నిది. ఈ నిర్మాణానికి సెల్లార్ అనుమతి లేదు. ముందు వైపు షెడ్లు ఏర్పాటు చేసి, సెల్లార్‌తో పాటు సెట్ బ్యాక్స్ వదలకుండా భవన నిర్మాణ అతిక్రమణలకు పాల్పడ్డాడు.

▸ నగరంలోని విద్యుత్‌నగర్, తదితర ప్రాంతాల్లో ప్రచార బోర్డులను (లాలి పప్స్) ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారు. వాస్తవంగా ముందస్తుగా టౌన్ ప్లానింగ్ అనుమతి తీసుకోవాలి. ఒక్కో బోర్డుకు రూ.5 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. కానీ పైసా డబ్బు చెల్లించకుండా నగరంలో పదుల సంఖ్యలో బోర్డులను ఏర్పాటు చేశారు. ఇలా నగరంలో కొన్ని ప్రాంతాల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

అక్రమ నిర్మాణదారులపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందిని ఆదేశించాం. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే వాటిని తొలగించాలని ఇది వరకే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం.

– భాగ్యలక్ష్మి, కమిషనర్

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు జరుగుతుండడంతో ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డీ1 సెక్షన్ పరిధిలోని సాయినగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అరవింద్‌నగర్, ఓబులదేవ్‌నగర్, నాయక్‌నగర్, విద్యుత్‌నగర్, కృపానందనగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్మకూరు: మండలంలోని గొరిదిండ్లకు చెందిన హరిజన కుంటిప్ప (48) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన హరిజన కుంటిప్ప తనకున్న 3 ఎకరాల్లో పంటలు సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. పంటల పెట్టుబడికోసం అప్పులు అధికంగా చేశాడు. దీనికితోడు ఇటీవల కూతురు భర్త కూడా రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. చేసిన అప్పులు తీరక, తీర్చే మార్గంలేక మదనపడుతుండేవాడు. రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురికావడంతో బంధువులు సర్వజనాస్పత్రికి చికిత్సనిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుంటెన్న వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పనిచేసేవాడు.

27న క్రీడా వార్షిక సమావేశం

అనంతపురం: ఎస్కేయూలోని పాలిమర్ సైన్సు విభాగంలోని సెమినార్ హాలులో ఈనెల 27న క్రీడా వార్షిక సమావేశం నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఎంపీ శ్రీనివాసన్ తెలిపారు. 2023–24 అంతర కళాశాలల టోర్నీలకు సంబంధించిన అంశంపై ప్రధానంగా చర్చ జరగనున్నట్లు తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనుబంధ డిగ్రీ కళాశాలల పీడీలతో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడతారన్నారు.

నేడు సమావేశం

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్‌ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పీవీకేకే కళాశాలలో ఆదివారం ఉంటుందని జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పీఎఫ్ కనీస పింఛన్, హయ్యర్ పెన్షన్, ఎస్‌ఆర్‌బీఎస్ పింఛన్లపై చర్చించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

దేశ సేవలో భాగస్వాములు కావాలి



శాస్త్రవేత్త సాయి చందన తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: దేశ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చంద్రయాన్–3 ప్రయోగ విభాగం జూనియర్ పరిశోధన శాస్త్రవేత్త సాయి చందన పేర్కొన్నారు. శనివారం మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలోని మాంటిస్సోరి ఎలీట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సాయి చందన, ఆమె తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలన్నారు. దేశానికి యువత పట్టుకొమ్మలని, దేశ రక్షణలో యువత భాగస్వామ్యం అవసరమన్నారు. అభివృద్ధి చెందిన దేశాలకు సాధ్యంకాని చంద్రుని దక్షిణ ధ్రువానికి ‘విక్రమ్’ను పంపించి సత్తా చాటామన్నారు. శాస్త్రీయ ప్రజ్ఞ భారత యువతలో స్ఫూర్తి నింపుతుందన్నారు. అనంతరం సాయి చందన తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల ఎండీ భరత్ కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక టవర్‌క్లాక్ వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకొచ్చిన తర్వాత దేశానికి గౌరవం తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, పార్లమెంట్ కన్వీనర్ చిరంజీవి రెడ్డి, శ్రీధర్, అశోక్‌రెడ్డి, దేవిరెడ్డి లక్ష్మిదేవి, కొనకొండ రాజేష్, మల్లారెడ్డి, వసుంధర, అజేష, మల్లేశ్వరి, సుమతి, అంజిబాబు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీఓ సురేష్‌నాయుడు

అనంతపురం సెంట్రల్: రహదారి నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆర్టీఓ సురేష్‌నాయుడు తెలిపారు. శనివారం జాతీయ రహదారిలో లారీ ఓనర్స్ అసోషియేషన్ కార్యాలయంలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీఓ మాట్లాడుతూ దూరప్రాంతాలకు సరుకు రవాణా చేసే క్రమంలో చాలా మంది డ్రైవర్లు అతివేగంతో వాహనాలు నడుపుతున్నారన్నారు. పరిమితికి మించి సరుకు రవాణా చేస్తున్నారన్నారు. వాహనాలు నడిపే సమయంలో కుటుంబ సభ్యులను పరిస్థితులను కూడా ఆలోచించాలని, రోడ్డు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. నిద్రలేకుండా వాహనాలు నడపడం వలన అనారోగ్యాల భారిన పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ రమణారెడ్డి, లారీ ఓనర్స్ అసోషియేషన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

మందుల వాడకంపై అవగాహన అవసరం



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

అనంతపురం క్రైం: మందుల వాడకంతో తలెత్తే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం భారత దేశ వైద్య ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆదేశాలతో నిర్వహిస్తున్న 3వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వీక్‌లో భాగంగా ఫార్మకాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ర్యాలీ వైద్య కళాశాల నుంచి తెలుగుతల్లి విగ్రహం నుంచి సప్తగిరి సర్కిల్, తిరిగి వైద్య కళాశాలకు చేరుకుంది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఔషధ ప్రతికూల చర్యలు, అలర్జీలు తదితర సమస్యలు తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్ 1800 180 3024 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ శ్యాంప్రసాద్, ఫార్మకాలజీ వైద్యులు డాక్టర్ ఆశాలత, డాక్టర్ పద్మశ్రావణి, డాక్టర్ రియాజ్, డాక్టర్ కుష్బూ, డాక్టర్ ఫర్హాన, డాక్టర్ ఫిరోజ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

అనంతపురం: అంతర్జాతీయ స్థాయి పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ ఇంక్యుబేషన్ సెంటర్, ఇంటర్నల్ స్మార్ట్ ఇండియా సంయుక్తంగా శనివారం హ్యాక్‌థాన్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించి మాట్లాడారు. స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ ఎంపిక చేయబడిన టీమ్‌ల ఆలోచనలు, ప్రాజెక్టులను స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ విభాగానికి పంపుతారన్నారు. వారు ఆమోదించిన ప్రాజెక్ట్ టీమ్‌లు, బీఎస్ అబ్దుర్ రెహమాన్ క్రిసెంట్ ఇన్‌స్టిట్యూట్, చెన్నైలో జరగనున్న కార్యక్రమంలో ప్రదర్శిస్తారన్నారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జి. మమత మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యత పెంపొందేలా కృషి చేయాలన్నారు. స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్‌లో మొత్తం 30 ప్రాజెక్ట్ టీమ్‌ల ఆవిష్కరణలు ప్రదర్శించారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ కే మాధవి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ అరుణా కాంతి, డాక్టర్ ఏపీ శివ కుమార్, డాక్టర్ ఎస్. చంద్రమోహన్ రెడ్డి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, డాక్టర్ బి. దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ

పంచాయతీ అభివృద్ధి ఓర్వలేకే దాడి

- రాచానపల్లి సర్పంచ్ బండా అంజియాదవ్

రాప్తాడురూరల్: గతంలో ఎప్పుడూలేని విధంగా పంచాయతీని అభివృద్ధి చేశా.. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చేశాం. పంచాయతీలో టీడీపీ ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతోనే జీర్ణించుకోలేక తనపై దాడికి పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు, రాచానపల్లి సర్పంచు బండా అంజియాదవ్ అన్నారు. టీడీపీ హయాంలో చేయలేని అభివృద్ధి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో తాను చేసి చూపించానన్నారు. శనివారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కార్యకర్తలు దేవరకొండ మహేష్, బద్దుల మహేష్ తదితరులు వీధిరౌడీల్లా ప్రవర్తించారన్నారు. వినాయక విగ్రహ నిమజ్జనం ఊరేగింపులో ఉన్న తనపై వందలాది మంది గ్రామస్తులు చూస్తూ ఉండగా టీడీపీ కార్యకర్తలు తప్పతాగి దాడి చేశారన్నారు. ప్రజల్లో తమ పార్టీకి చెడ్డపేరు వస్తుందని భావించి ఉనికి కాపాడుకునేందుకు ప్రెస్‌మీట్ పెట్టి కొందరు టీడీపీ నాయకులు తనపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. సీఆర్‌ఐటీ దగ్గర రెండెకరాల్లో ప్లాట్లు వేసి ప్రజలకు ఇచ్చామని చెబుతున్నారు..అందులో 11 ప్లాట్లు మాజీ సర్పంచ్ ఒక్కడే అమ్ముకున్నాడన్నారు. పేదల పేరుతో టీడీపీ కార్యకర్తలే ఎక్కువగా ఉన్నారని, దీన్ని నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అప్పట్లో అవినీతి, అక్రమాల మరక ఉండడంతోనే, ఆ ప్రభావం పార్టీపై పడకూడదని గత శాసనసభ, సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో గ్రామంలోకి మాజీ సర్పంచును అడుగుకూడా పెట్టనీయని సంగతి ప్రజలందరికీ తెలుసునన్నారు. రాచానపల్లి పీఏసీఎస్ చైర్మన్ గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ అంజియాదవ్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి జీర్ణించుకోలేక టీడీపీ వాళ్లు దాడికి పాల్పడ్డారన్నారు. చేతనైతే మంచి పనులు చేసి ప్రజలకు చేరువకావాలి తప్ప.. ఇలా దౌర్జన్యాలకు పాల్పడితే ప్రజలు విశ్వసించరనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ గౌస్, సచివాలయ కన్వీనర్ బాలకృష్ణ, నాయకులు భానుకోట శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజియాదవ్

బ్రూసెల్లోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లు రూరల్: బ్రూసెల్లోసిస్ పశువుల నుంచి మనుషులకు వ్యాపించే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. శనివారం వెంకటాంపల్లిలో పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. యాజమాన్య పద్ధతులపై గొర్రెలు, మేకల కాపర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గొర్రెలు, మేకల్లో ప్రధాన ఆరోగ్య సమస్య అయిన బ్రూసెల్లోసిస్ గురించి వివరించడంతో పాటు, దాదాపు 30 గొర్రెల నుంచి రక్తనమూనాలను సేకరించి విజయవాడలోని ప్రాంతీయ పరిశోధన కేంద్రానికి తరలించారు. వ్యాధి బారిన పడిన గొర్రెలు, మేకలు చివరి మూడు నెలల చూడికాలమందు ఈసుకు పోతాయని తెలిపారు. పాట్లేళ్లలో బీజాలు వేయడం, సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గిపోవడం, బలహీనమైన పిల్లలు పుట్టడం, ఈతకు ఈతకు మధ్య కాలం పెరగటం వంటి వాటివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. ఈసుకుపోతున్న గొర్రెలు, మేకలను గుర్తించి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించాలని, వ్యాధి నిర్ధారణ అయితే మంద నుంచి వేరు చేయాలన్నారు. విత్తన పాట్లేళ్లను ప్రతి మూడేళ్లకోసారి మార్చాలని సూచించారు. ఈవ్యాధిబారిన పడకుండా పిల్లలకు నాలుగు నుంచి 8 నెలల వయస్సులో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. పశుశాఖ అసిస్టెంట్ ఈరన్న, శ్రీనివాసులు, సవ్య, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.



గొర్రెల నుంచి రక్త సమూనాలను సేకరిస్తున్న దృశ్యం

పశువులకు గర్భకోశ పరీక్షలు తప్పనిసరి

నార్పల: సుడి నిర్ధారణ, ఎదకు వచ్చిన కట్టకుండా నిలిచిపోవడం, పూర్తిగా ఎదకు రాని పశువులకు గర్భకోశ పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి సుధాకర్ పేర్కొన్నారు. శనివారం ఆయన గుంజేపల్లి గ్రామంలో పశువుల గర్భకోశ శిబిరం ఏర్పాటు చేసి పశువులకు గర్భస్థ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ పథకం గురించి పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ పథకం ద్వారా రూ.1,350 విలువ గల పెయ్యదూడలను పొందే రెండు సూదులను రూ.850 సబ్సిడీ పోగ రూ.500 కే రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. పశువైద్యాధికారి రాధిక తదితరులు పాల్గొన్నారు.



గర్భకోశ పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారులు

స్వచ్ఛ నగరమే లక్ష్యం

అనంతపురం కార్పొరేషన్: స్వచ్ఛ నగరమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగరంలోని 39వ డివిజన్ లక్ష్మీనగర్‌లోని జన్మభూమి పార్క్‌లో స్వచ్ఛత లీగ్ 2లో స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా పార్క్‌ను శుభ్రం చేసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. మేయర్ వసీంతో పాటు డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య పార్క్‌లో చెత్తను తొలగించి, మొక్కలు నాటారు. మేయర్ వసీం మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగునకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. స్వచ్ఛ నగరాలను నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజలను అందులో భాగస్వాములను చేస్తోందన్నారు. ఇప్పటికే యువత భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమం, పార్కులను శుభ్రం చేయడం, 2 కే రన్ తదితర కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. చెత్తరహిత నగరంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా క్లాప్ ఆటోలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎస్ఈ నాగమోహన్, ఈఈలు సూర్యనారాయణ, సుధారాణి, డీఈలు ప్రసన్నలక్ష్మి, రాంప్రసాద్‌రెడ్డి, సుభాష్‌చంద్రబోస్, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు చింతకుంట మధు, ఖాజా, నాగార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం

వైభవంగా వసంతశోభ

అనంతపురం కల్చరల్: ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి తర్వాత వైభవంగా జరిగే రాధాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ఇస్కాన్ మందిరం భక్తజనంతో కిటకిటలాడింది. ఇతర ప్రాంతాల నుంచి తెప్పించిన ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా రాధాపార్థసారథులను అలంకరించారు. అనంతరం వసంత శోభను నిర్వహించారు. కృష్ణనామ సంకీర్తనతో సాగిన కార్యక్రమం అందరినీ ఆధ్యాత్మిక సాగరంలో ముంచెత్తింది. ఇస్కాన్ చైర్మన్ దామోదరగౌరంగదాసు ప్రభు కృష్ణతత్వాన్ని వివరించారు. రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలను నిర్వహించారు. మధ్యాహ్నం మహా మంగళహారతి అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.



ప్రవచనం చెబుతున్న ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర గౌరంగదాసు

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

బుక్కరాయసముద్రం: నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు నివారిద్దామని ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో అసోసియేషన్ ఫర్ గ్లోబల్ రూరల్ అలర్ట్ (ఆగ్రా) సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, ప్రభుత్వ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణ కోసం అనేక చట్టాలను ప్రవేశ పెట్టిందన్నారు. బాలికలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. చిన్న వయస్సులో విద్యార్థులు వాహనాలను నడపరాదన్నారు. బాలికలు, మహిళలు సెల్ ఫోన్లు వాడే సమయంలో అపరిచిత వ్యక్తుల పట్ల చాలా జాగ్రత్తలు పాటించాలన్నారు. సైబర్ నేరాలు, మహిళా చట్టాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎంఈఓ రఘునందన్, హెచ్ఎం వసుంధర, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ఎన్జీఓ రామప్ప, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు నారాయణస్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు : మిడుతూరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. తానీషా అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు నుంచి హైదరాబాద్ బయలుదేరాడు. మిడుతూరు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కంపచెట్లలోకి దూసుకెళ్లింది. ఘటనలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

స్వచ్ఛతే ప్రజల కర్తవ్యం



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నార్పల: ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించాలంటే స్వచ్ఛతే మన కర్తవ్యంగా భావించాలని డీఎల్‌పీఓ సమన జయంతి, ఎంపీడీఓ దివాకర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు పాఠశాల విద్యార్థులతో కలసి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ గ్రామస్తులంతా ఇళ్లు, పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల దోమలు తగ్గడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచు మన్నీల సుప్రియ, ఎంఈఓ నారపరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తలనీలాల సేకరణ హక్కు వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలు సేకరించుకనే హక్కు కోసం శనివారం వేలంపాట నిర్వహించారు. అనసూయమ్మ రూ.1.80 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు ఈఓ దేవదాసు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, సభ్యులు డేగ బాల రంగయ్య, ప్రమీల గౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు పురుషోత్తం యాదవ్ పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



బిడ్డను అందిస్తున్న 108 సిబ్బంది

రాప్తాడు: శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కుర్లపల్లికి చెందిన ఫాతిమా 108 వాహనంలో ప్రసవమైంది. ఆమె శనివారం తెల్లవారుజామున మగబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు.. ఫాతిమా పురిటినొప్పులతో బాధపడుతుండగా అనంతపురం సర్వజనాస్పత్రికి 108 వాహనంలో తీసుకెళ్తున్నారు. రాప్తాడు మండలంలోని మరూరు టోల్ ప్లాజా వద్దకు వెళ్లగానే పురిటినొప్పులు అధికం కావడంతో 108 వాహన సిబ్బంది ప్రసవం చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ అనంతపురం సర్వజనాస్పత్రిలో సురక్షితంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

వేలంపాట వాయిదా

అనంతపురం కార్పొరేషన్: టవర్‌క్లాక్ వద్దనున్న నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లోని మూడు షాపుల వేలం పాట ఈ నెల 27కు వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థలో మూడు షాపులకు సంబంధించి బహిరంగ వేలం పాట నిర్వహించారు. పాటదారులు ఎవరూ హాజరుకాలేదు. నగరపాలక సంస్థ అధికారులు వేలంపాటపై ప్రచారం చేయకపోవడంతో సమస్య తలెత్తినట్లు నగరపాలక సంస్థ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఒకరికి గాయాలు

గార్లదిన్నె: ఎగువపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలి పిన వివరాలు.. రాయదుర్గం మండలం వేపరాల గ్రామానికి చెందిన వన్నూర్‌స్వామి ఎగువపల్లి వద్ద ఓ హోటల్లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించేవాడు. వన్నూర్‌స్వామి రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇన్‌చార్జ్ ఏసీపీగా మారుతీప్రసాద్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం ఇన్‌చార్జ్ ఏసీపీగా మారుతీప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా పని చేసే బాలాజీ నెల రోజులపాటు సెలవుపై వెళ్లిన విషయం విదితమే. మారుతీ ప్రసాద్ మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఏసీపీగా పని చేస్తూ, అనంతపురం నగరపాలక సంస్థలో ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు.

కాలువ పూడిక తీత పనులు ప్రారంభం

రాప్తాడు: హంద్రీనీవా కాలువ నుంచి ఎం.బండమీదపల్లి గ్రామ చెరువులోకి వచ్చే కాలువ పూడిపోయింది. దీంతో కాలువలో పూడికతీత పనులు చేపట్టాలని గ్రామస్తులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. పూడికతీత పనులు చేపట్టాలని మండల యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డికి సూచించారు. దీంతో ఆయన గత నాలుగు రోజుల నుంచి కాలువలో పూడికతీత పనులు చేయిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఫక్కీరప్ప, సూర్యనారాయణ, మారక సుబ్బారెడ్డి, సాయినాథ్ రెడ్డి, సింగారప్ప తదితరులు పాల్గొన్నారు.